

స్వచ్ఛతే లక్ష్యంగా..

స్వచ్ఛ సర్వేక్షణ్‌- 2023 పోటీల్లో పాల్గొనేందుకు మున్సిపాలిటీలు పోటీపడుతున్నాయి.

వివరాలు 8లో ▸



13 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 13 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.2 /23.1

వాతావరణం

ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. వర్షం పడే అవకాశం లేదు.

పల్లె పాలన అస్తవ్యస్తం!

- ఏడాదిగా విడుదల కాని కేంద్ర, రాష్ట్ర నిధులు
- జీపీల కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం
- భారీగా బిల్లుల పెండింగ్‌
- పలు ప్రాంతాల్లో నిలిచిన అభివృద్ధి పనులు

గ్రామ పంచాయతీలకు ఆర్థిక ఇక్కట్లు



ఇది మహబూబ్‌నగర్‌ జిల్లా నవాబుపేట మండలం చౌడూర్‌ గ్రామ వ్యూ ఫొటో. 3,813 మంది జనాభా, 1,879 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామానికి ప్రతి నెల కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మొత్తం రూ.2.30 లక్షలు వచ్చేవి. కానీ గతేడాది జూలై నుంచి ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. మధ్యలో నవంబర్‌ నుంచి మూడు నెలల పాటు కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాగా.. ఆ తర్వాత అవి కూడా రావడం లేదు. దీంతో శానిటేషన్‌, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణతో పాటు తాత్కాలికంగా అవసరమయ్యే పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిధులు రాకపోవడంతో డ్రెయినేజీల నిర్మాణాలు తదితర యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులు నిలిచిపోయాయి.
.. ఈ పరిస్థితి ఈ ఒక్క గ్రామానిదే కాదు. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో ఉన్న అన్ని పల్లెలు ఇలాంటి దుస్థితిలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రత్యేక నిధుల మాట పక్కన బెడితే.. నెలనెలా పంచాయతీలకు కేంద్రం, రాష్ట్రం నుంచి విడుదలయ్యే సాధారణ, ఎస్సీ, ట్రైబల్‌ ఫండ్‌ (ఆర్థిక సంఘం) ఏడాది కాలంగా నిలిచిపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్‌



దుర్గంధం వెదజల్లుతున్న మురుగు కాలువ

కేంద్ర నిధులపై ఆంక్షలు..

ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాలో మొత్తం 1,692 గ్రామ పంచాయతీలున్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం సాధారణ నిధులతో పాటు ఎస్సీ, ట్రైబల్‌ సబ్‌ ప్లాన్‌ నిధులను ప్రతి నెలా జానాభాకు అనుగుణంగా విడుదల చేయాలి. అదే ప్రకారంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు సైతం జమ కావాలి. కానీ సంవత్సర కాలంగా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ఆరు నెలల క్రితం గ్రామ పంచాయతీల వారీగా బ్యాంకుల్లో ప్రత్యేక ఖాతాలు తెరిచారు. సర్పంచ్‌, ఉప సర్పంచ్‌ పేరు మీద ఉండే ఈ ఖాతాల్లోనే కేంద్ర నిధులు జమ చేస్తున్నారు. కొంతకాలంగా అడపాదడపా కొద్దోగొప్పో నిధులు విడుదల చేస్తున్నప్పటికీ.. వినియోగంపై అనేక ఆంక్షలు పెట్టారు. టైడ్‌, అన్‌టైడ్‌ కేటగిరీల వారీగా నిధులను వాడుకోవాలని నిర్దేశిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్ర నిధులపై ఫ్రీజింగ్‌ కొనసాగుతోంది. మొత్తానికి ఏడాది కాలంగా అటు కేంద్రం, ఇటు రాష్ట్రం నుంచి సకాలంలో నిధుల విడుదల కాకపోవడంతో పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి.



జీపీలకు ప్రతినెలా విడుదల కావాల్సిన ఆర్థిక సంఘం నిధులు.. (రూ.కోట్లలో)

జిల్లా	జీపీలు	మొత్తం నిధులు
మహబూబ్‌నగర్‌	441	11.50
నారాయణపేట	280	10.08
నాగర్‌కర్నూల్‌	461	16.43
జోగుళాంబ గద్వాల	255	11.37
వనపర్తి	255	11.96
మొత్తం	1,692	61.34

తలపట్టుకుంటున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు

గ్రామాలను పట్టణాలతో సమానంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడుతోంది. పల్లె ప్రగతి, హరితహారం వంటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలను చేపట్టి గ్రామీణ వాతావరణాన్నే మార్చేలా ప్రణాళికను అమలు చేస్తున్నప్పటికీ.. నిధుల కొరత అభివృద్ధికి ప్రతిబంధకంగా మారింది. గ్రామాల్లో చేపట్టిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడం, ఆర్థిక సంఘాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సమ్మె విరమించి కార్మికులు విధుల్లో చేరినా..

మరోవైపు తమ సమస్యల పరిష్కారం కోసం మల్టీపర్పస్‌ కార్మికులు 30 రోజులకు పైగా సమ్మె చేపట్టారు. ఇటీవల వారు విధుల్లో చేరినప్పటికీ పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో పలు ప్రాంతాలు చెత్తాచెదారంతో నిండి దుర్గంధమయంగా మారాయి. ప్రస్తుతం వర్షాకాల సీజన్‌ కావడం.. వ్యాధులు విజృంభించే అవకాశం ఉండడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

నిధుల కొరత..



గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు సకాలంలో రాకపోవడం వల్ల ధైర్యంతో పనులు చేయలేకపోతున్నాం. చేసిన పనులకు నెలల తరబడిగా బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలు కావాల్సి వస్తుంది. గ్రామంలో దాదాపు రూ.20 లక్షల మేర అభివృద్ధి పనులు చేపట్టాం. చిన్న గ్రామం అయినప్పటికీ అధికారుల ఒత్తిడితో పనులు చేపట్టాం. దాదాపు రూ.5 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది.

– కుర్మయ్య, సర్పంచ్‌, యత్మతాపూర్‌, తాడూరు మండలం

న్యూస్‌రీల్‌

16న ముగియనున్న ఓపెన్‌ డిగ్రీ అడ్మిషన్ల గడువు

కందనూలు: అంబేద్కర్‌ ఓపెన్‌ డిగ్రీలో ప్రవేశాలకు చివరి తేది ఈనెల 16తో ముగియనుందని అంబేద్కర్‌ ఓపెన్‌ డిగ్రీ సమన్వయకర్త వర్కాల శ్రీనివాస్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌, ఐటీఐ, ఏదైన రెండేళ్ల డిప్లొమా పూర్తిచేసిన వారు డిగ్రీకి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా చదువు మధ్యలోనే ఆపేసిన గృహిణులు, యువతీ యువకులు, ప్రభుత్వ,ప్రైవేట్‌ ఉద్యోగస్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి సమాచారానికి సెల్‌ నం.7382929779లో సంప్రందించాలని కోరారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొల్లాపూర్‌: అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్‌ నియోజకవర్గ ఫొటో, వీడియోగ్రాఫర్స్‌ అసోసియేషన్‌ భవనానికి రైతువేదిక సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలంలో భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసేందుకు ఫొటోలు, వీడియోలే ప్రధానమన్నారు. ఫొటో, వీడియోగ్రాఫర్లకు స్థలం కేటాయిస్తానని గతంలో మాట ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు భవన నిర్మాణానికి భూమిపూజ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి, ఫొటో,వీడియోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర నాయకులు రాపర్తి శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు నేతాజీ, రాఘవులు, రవి, కట్టా శ్రీనివాసులు, నియోజకవర్గ నాయకులు షబ్బీర్‌, హసన్‌పీర్‌, తిరుపతయ్య, సైదులు, మైనోద్దీన్‌, వినోద్‌, జాన్స్‌, భాస్కర్‌ తదితరులున్నారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన

కొల్లాపూర్‌ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ సమీపంలో నూతనంగా చేపట్టిన రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల పురోగతి గురించి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మితో చర్చించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇదిలాఉండగా, పెద్దకొత్తపల్లి మండలం కొత్తయాపట్లకి చెందిన వార్డు సభ్యులు బొల్లె దామోదర్‌, కాంగ్రెస్‌ పార్టీ గ్రామ అధ్యక్షుడు సంగెం శ్రీశైలంతో పాటు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కోడేరు మండలం తీగలపల్లిలో మాజీమంత్రి జూపల్లి అనుచరులు, కొల్లాపూర్‌ మండలం మాచినేనిపల్లికి చెందిన ఎల్లేని నర్సింహ్మారావుతో పాటు మరికొందరు కూడా బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పారు. అదేవిధంగా, కొల్లాపూర్‌ నుంచి నాగర్‌కర్నూల్‌, వనపర్తి, పెబ్బేర్‌, కర్నూల్‌ మీదుగా తిరుపతి వెళ్లే ఆర్టీసీ బస్సు సేవలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈరోజు నుంచి తిరుపతి బస్సు పయాణాలు ప్రారంభమవుతాయని డీఎం తెలిపారు.

‘ఉద్యమ సారథి గద్దర్‌’

వనపర్తిటౌన్‌: సమాజాన్ని చైతన్యపర్చిన ఉద్యమ సారథి గద్దర్‌ అని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్‌ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని రేడియంట్‌ ఉన్నత పాఠశాలలో సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన గద్దర్‌ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.

రాష్ట్రంలో కర్ణాటక ఫలితాలు పునరావృతం



కర్ణాటక ఎమ్మెల్యే బీవీ మోహన్‌ను సన్మానిస్తున్న మల్లురవి, వంశీకృష్ణ

అచ్చంపేట: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటక ఫలితాలు పునరావృతం అవుతాయని, కాంగ్రెస్‌ పార్టీ అధికారం చేపడుతుందని కర్ణాటక ఎమ్మెల్యే, పార్లమెంట్‌ ఇన్‌చార్జ్‌ బీవీ మోహన్‌ అన్నారు. ఆదివారం అచ్చంపేటలో జరిగిన కాంగ్రెస్‌ పార్టీ మండల, నియోజకస్థాయి సమీక్ష సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లే లక్ష్యంగా పనిచేసేందుకు కార్యకర్తలు సమాలోచనలు చేయాలన్నారు. బూత్‌ లెవల్‌ కార్యకర్తలు గడపగడపకూ వెళ్లి బీఆర్‌ఎస్‌ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, కాంగ్రెస్‌ పార్టీ విధానాలు చెబుతూ కరపత్రాలు అందజేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేరవేర్చలేదని, ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్‌ కుటుంబం దోచుకుందన్నారు. కాంగ్రెస్‌ పార్టీ పిలుపునిచ్చిన మేరకు తిరగబడదాం.. తరిమి కొడదాం అనే పోరాట నినాదంతో ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా నెల రోజుల పాటు ప్రతి కుటుంబానికి ప్రజా చార్జ్‌షీటు అందేలా చూడాలని కోరారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌లు ఇద్దరు తోడుదొంగలని, కలిసే అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ తొమ్మిదేళ్ల పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి తీసికెళ్లాలని కోరారు. నీళ్లు నిధులు, నియామకాల పేరుతో అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్‌ పూర్తిగా విఫలమైందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. ప్రభుత్వ భూములు అమ్ముతూ రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నారని, ప్రజల సొమ్ము కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటుందని ఆరోపించారు. అనంతరం ఏఐసీసీ నిర్వహించిన నేతృత సంఘం శిక్షణలో పాల్గొన్న చత్రునాయక్‌ను శాలువతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మల్లు రవి,డాక్టర్‌ వంశీకృష్ణ,కెవిఎస్‌రెడ్డి, డాక్టర్‌ అనురాధ, ఎ.గోపాల్‌రెడ్డి, చత్రునాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది నాలుగురోజులే..

- మందకొడిగా మద్యం టెండర్లు
- గ్రూపులు కడుతున్న లిక్కర్‌ వ్యాపారులు
- గతంలో పోల్చితే భారీగా తగ్గిన దరఖాస్తులు
- 18వరకు వేచిచూసే ధోరణిలో వ్యాపారులు



అచ్చంపేట: మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ మందకొండిగా సాగుతోంది. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై వారం గడవగా.. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 205 దరఖాస్తులు వచ్చాయి. టెండర్‌ ఫీజు రూ.2లక్షలు ఉన్నప్పటికీ గతంలో పెద్ద ఎత్తన దరఖాస్తులు వచ్చాయి. ఇప్పుడు పాతవారితో పాటు కొత్త వ్యక్తులు బరిలో ఉంటారని భావించినప్పటికీ దరఖాస్తుల సంఖ్య తక్కువగానే ఉంటోంది. కొందరు మంచి ముహుర్తం కోసం వేచిచూస్తుండగా.. మరికొందరు పక్కావ్యూహంతో గ్రూపులు కట్టేందుకు సిద్ధం అవుతున్నారు. 2023–25 ఆర్థిక సంవత్సరానికి మద్యం షాపుల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఈనెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ ఎక్సైజ్‌శాఖ చేపట్టింది. ఈనెల 18 వరకు చివరి తేదీగా నిర్ణయించారు. ఈసారి రెండు వారాల గడువు ఇవ్వడంతో జిల్లాలో దరఖాస్తుల సంఖ్య తగ్గింది. దరఖాస్తుల సంఖ్య పెంచేలా ఎక్సైజ్‌ అధికారులు వ్యాపారులు,ఇతరులకు అవగాహన కల్పిస్తున్నారు.

గ్రూపులుగా బరిలోకి..


జిల్లా వ్యాప్తంగా కొందరు గ్రూపులుగా టెండర్లు దఖాలు చేసి వచ్చిన షాపులను కలిసి నిర్వహించుకుంటారు. వీరందరూ కలిసి వందల సంఖ్యలో దుకాణాలను టెండర్లు వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. టెండర్‌ దరఖాస్తులకు ఈనెల18 గడువు కాగా.. చివరి రెండురోజుల్లో పెద్ద ఎత్తున టెండర్‌ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. గతంలో వందల సంఖ్యలో టెండర్లు వేసినా.. పలు గ్రూపులకు రెండు నుంచి నాలుగు వైన్స్‌లకన్నా ఎక్కువ రాలేదని చర్చ జరగుతుంది. ఈసారి ఖచ్చితంగా వైన్స్‌ వచ్చేలా వ్యూహం పన్నుతున్నారు. టెండర్‌ ఫీజు రూ.2లక్షలు ఉండడంతో కొత్తవారు అలోచించి అడుగులు వేస్తున్నారు.

డిమాండ్‌ ఉన్న షాపులపై నజర్‌

చాలా మంది మద్యం వ్యాపారులు డిమాండ్‌ ఉన్న షాపులపై దృష్టి సారించారు. ఇంకో నాలుగురోజుల సమయం ఉండడంతో డిమాండ్‌ ఉన్న షాపుల్లో ఎక్కువ దరఖాస్తులు వేటికి వచ్చాయి. ఏఏ షాపులకు దరఖాస్తు చేయాలనే అంశాలపై దృష్టి పెట్టారు. ప్రస్తుతానికి జిల్లాలో ఇప్పటి వరకు అత్యధికంగా కల్వకుర్తి షాపు నంబరు 38కి 19, నాగర్‌కర్నూలు షాపు 3కి 18 దరఖాస్తులు వచ్చాయి.

తగ్గిన దరఖాస్తులు..

జిల్లాలో ఇప్పటి వరకు చాలా తక్కువ దరఖాస్తులు వచ్చాయి. 18 వరకు గడువు ఉండడంతో చాలా మంది వ్యాపారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ముందుస్తు మద్యం టెండర్లపై ఇప్పటికే కొందరు కోర్టును ఆశ్రయించారని, దరఖాస్తులు వేసి ఎందుకు చిక్కుకోవాలనే ధోరణిలో చాలా మంది వేసిచూస్తున్నారు. సోమవారం తర్వాత టెండర్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. చివరి తేదీ నాటికి ఆయా షాపులకు వచ్చిన దరఖాస్తులు, డిమాండ్‌ ఉన్న షాపులను దృష్టిలో ఉంచుకొని టెండర్‌లో పాల్గొన్నాలని చూస్తున్నారు. చివరి రోజు 60నుంచి 70శాతం దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్‌ అధికారులు పెర్కొంటున్నారు.



మహబూబ్‌నగర్‌లోని కేబుల్‌ బ్రిడ్జి

ఆకాశవీధిలో..

- జిల్లాకేంద్రంలో అట్టహాసంగా డ్రోన్‌ షో
- సాయంత్రం నుంచే వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- ఎంతగానో ఆకట్టుకున్న 9 ప్రదర్శనలు
- కేరింతలతో సందడి చేసిన యువత
- ఉర్రూతలూగించిన కళాకారుల ఆటపాటలు



తెలంగాణ మ్యాప్‌



పిల్లలమర్రి

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: పాలమూరులోని మినీట్యాంకుబండ్‌పై ఆదివారం రాత్రి రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 450 డ్రోన్ల ద్వారా నిర్వహించిన మెగా లేజర్‌ షో ఆకాశంలో కనువిందు చేసింది. 15 నిమిషాల పాటు ఆకాశంలో నిర్వహించిన వివిధ ప్రదర్శనలు అద్భుతంగా అనిపించాయి. కొన్నిరోజులుగా జిల్లా అధికారులు ఈ ప్రదర్శనపై విస్తృతంగా ప్రచారం కల్పించడంతో వేలాది మంది తరలివచ్చారు. సాయంత్రం ఐదు గంటల నుంచే జనం రాక మొదలైంది. ఒకవైపు మినీ ట్యాంక్‌బండ్‌ ప్రధాన ద్వారమైన మోడ్రన్‌ రైతుబజార్‌ పక్క నుంచి, మరోవైపు షాషాబ్‌గుట్ట– భగీరథకాలనీ చౌరస్తా మధ్యనున్న కట్ట నుంచి స్టేజీ వద్దకు అనుమతించారు. ముందుగా హైదరాబాద్‌ నుంచి వచ్చిన కళాకారులు తెలంగాణపై పాడిన పాటలు ఆహుతులను అలరించాయి. ముఖ్యంగా రేలారేలారే.. నా తెలంగాణ, బలగం సినిమాలోని ఊరు.. పల్లెటూరు.. తదితర పాటలకు యువత కేరింతలు కొట్టారు. లేజర్‌ షో ప్రదర్శనకు ముఖ్య అతిథి హాజరైన రాష్ట్ర ఎక్సైజ్‌, క్రీడాశాఖ శ్రీనివాస్‌గౌడ్‌ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఈవెంట్స్‌ భవిష్యత్‌లోనూ ఏర్పాటు చేస్తామన్నారు. ఐలాండ్‌లో నిత్యం మ్యూజికల్‌ నైట్‌ నిర్వహిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వచ్చేలా ట్యాంక్‌బండ్‌, శిల్పారామంలో ఏర్పాట్లు చేస్తున్నామని, శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ తీసుకొచ్చి ట్యాంక్‌బండ్‌ నింపుతామన్నారు.



డ్రోన్‌ షో వీక్షించేందుకు తరలివచ్చిన ప్రజలు

అసమర్థ ప్రజాప్రతినిధుల వల్లే సాగునీరు అందట్లే..



వెల్దండలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: నియోజకవర్గానికి అసమర్థ ప్రజాప్రతినిధుల ఎంపిక వల్లనే అభివృద్ధిలో నిర్లక్ష్యం కల్గుతుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. ఆదివారం వెల్దండలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ముఖ్యమంత్రి కేసీఆర్‌ పూర్తిచేసి రైతులకుసాగునీరు అందిస్తున్నట్లు ఎమ్మెల్సీ పేర్కొన్నారు. కేఎల్‌ఐ ప్రాజెక్టులో భాగంగా డీ–82కాల్వను జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం నాగిళ్ల వరకు కేసీఆర్‌ ప్రతిపాదించి పూర్తిచేయాలనే లక్ష్యంతో సీఎం ముందుకు వెళ్తున్నారని, కల్వకుర్తి నియోజకవర్గానికి ఎంపికైన అసమర్థ ప్రజాప్రతినిధుల వల్ల చివరి ఆయకట్టుకు సాగునీరుకు నోచుకోవడం లేదన్నారు. ఏళ్లు గడుస్తున్నా నేటికి డీ–82కాల్వ పనులు పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్దండ మండలంలోని చెర్కూర్‌ సమీపంలో కాల్వ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు శాపంగా మారిందన్నారు. ప్రతి ఏడాది కేఎల్‌ఐ కాల్వ ద్వారా సాగునీరు అందిస్తున్న డీ–82కాల్వ పనులు మధ్యలో నిలిచిపోవడంతో నీరుప్రవాహం పెరగడంతో ప్రతి ఎడాది కాల్వలకు గండిపడి రైతుల వ్యవసాయ పొలాలు కొట్టుకుపోతున్నట్లు ఆయన వివరించారు. కాల్వ పనుల్లో నిర్లక్ష్యం చేయడంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందక, సాగునీరు వచ్చిన రైతులకు కాల్వలకు గండిపడి వారు నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. కేఎల్‌ఐ ప్రాజెక్టుల్లో రిజర్వాయర్లను ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రాంత రైతు దురదృష్టకరమన్నారు. గతంలో అక్విడిట్‌లను పూర్తి చేసి కల్వకుర్తి ప్రాంతానికి సాగునీరు తీసుకోచ్చి రైతులకు అందజేసినట్లు ఆయన గుర్తు చేశారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో రైతులకు మేలు

ఉమ్మడి పాలమూరు రైతుల కష్టాలను తీర్చడానికి ముఖ్యమంత్రి కేసీఆర్‌ ప్రతిపాదించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు ప్రారంభం కావడంతో ప్రతిపక్షపార్టీల నాయకులు కోర్టులో కేసులు అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. సుప్రీం కోర్టులో ప్రాజెక్టుకు అనుకూలంగా తీర్పు రావడంతో వేగవంతంగా పాలమూరు ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. ఐదు రిజర్వాయర్ల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షులు భూపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అలీ, సింగల్‌విండో వైస్‌చైర్మన్‌ సంజీవ్‌కుమార్‌, జంగయ్యయాదవ్‌, నాయకులు ఆనంద్‌కుమార్‌, సురేందర్‌రెడ్డి, షాన్‌వాజ్‌ఖాన్‌, రాజశేఖర్‌, హరికిషన్‌నాయక్‌ పాల్గొన్నారు.

నేడు బీచుపల్లిలో సీతారాముల కల్యాణం



బీచుపల్లిలోని కోదండరామస్వామి ఆలయం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్‌ సురేందర్‌ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు అదిక సంఖ్యలో తరలివచ్చి సీతారాముల కల్యాణ వేడుకను కనులారా తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని ఏదిరే పల్లికి చెందిన చింతకింది భూపాల్ (45) గురువారం చేపల వేటకు వెళ్లి శనివారం రాత్రి ఆ గ్రామ ఊర చెరువులో శవమై తేలాడు. ఎస్‌ఐ షేక్ శంషోద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం బాలానగర్ మండలంలోని గండేడ్ అత్తారింటి నుంచి వచ్చిన భూపాల్ నేరుగా ఏదిరేపల్లి చెరువులో చేపల వేట కోసం వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందగా, అతని మృతదేహం శనివారం రాత్రి గ్రామస్తులకు కన్పించింది. ఆదివారం ఉదయం మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ మరొకరు..

మక్తల్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పంచలింగాలకు చెందిన లింగప్ప (58) తన భార్య అలివేలుతో గొడవ పడ్డాడు. ఆవేశంలో ఇంట్లోని పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం

తాడూరు: మండలంలోని నిడుగుర్తిలో చెన్‌రాములు (42) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా.. చెన్‌రాములు మద్యానికి బానిసై తరుచుగా భార్య పార్వతమ్మను వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం భార్యను మద్యం కోసం డబ్బులు అడగగా ఆమె ఇవ్వకపోవడంతో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోకారి తెలిపారు.

జూరాల కాల్వలో యువకుడి గల్లంతు


మధు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువన నిర్మిస్తున్న టూరిజం పార్కు వద్ద పని చేసేందుకు వచ్చిన యువకుడు కుడి కాల్వలో గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూలుకు చెందిన మధు ఏళ్ల మరి కొందరితో కలిసి పని కోసం ఇక్కడికి వచ్చాడు. ఎప్పటిలాగే ఆదివారం కూడా పార్కు నిర్మాణ పనులు చేసుకుని సాయంత్రం ముగిశాక పక్కనే ఉన్న కుడి కాల్వలో కాళ్లు, చేతులు కడుక్కునేందుకు ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. వరద ప్రవాహం అధికంగా ఉండడంతో ధాటికి కొట్టుకుపోయాడు. గమనించిన కూలీలు విషయాన్ని పీజేపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నీటి విడుదలను నిలిపివేశారు. అప్పటికే యువడికి ఈత రాకపోవడంతో బయటకు రాలేకపోయినట్లు అక్కడే ఉన్న కొందరు చెప్పారు. సాయంత్రం 6:15 గంటల సమయంలో సంఘటన చోటు చేసుకోగా, నీటి విడుదలను నిలిపివేసి ఎస్‌ఐ శివానందంగౌడ్ నేతృత్వంలో పోలీసులు కాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో రాత్రి 8:30 గంటల వరకు ఆచూకీ లభించలేదు. గల్లంతైన యువకుడికి ఇంకా పెళ్లి కాలేదని, ఇప్పుడిప్పుడే సంబంధాలు చూస్తున్నట్లు సమాచారం. గాలింపు చర్యలను తిరిగి సోమవారం ఉదయం చేపట్టనున్నారు.

కేసు నమోదు

చారకొండ: మండలంలోని తుర్కలపల్లి పంచాయతీలో బొమ్మల గుడిసెలు గ్రామంలో శనివారం గీతా (19) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విధితమే. దీనిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆదివారం తండ్రి కప్పేర సంజీవరాములు మండల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల మేరకు యువతి గ్రామానికి చెందిన పర్వతం రాములు ప్రేమించుకోగా, పెద్దల సమక్షంలో మట్లాడి కొంతకాలంగా దూరంగా ఉన్నారు. దీంతో యువతిని పర్వతం రాములు, అతని భార్య, బావమరిది వేధించడంతో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: కాల్వలో గల్లంతైన మహిళ మృతదేహం ఆదివారం సాయంత్రం లభ్యమైంది. రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల మండలం కొత్తపల్లికి చెందిన సుల్తాన బేగం (35) శనివారం సాయంత్రం గంజిపేట సమీపంలో పీజేపీ కుడి కాల్వ వద్ద నీటి ప్రవాహాన్ని చూసేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు ఆమె కాల్వలో జారి పడింది. రక్షించేందుకు స్థానికులు కాల్వలో దూకినా నీటి ప్రవాహం ఉండడంతో గల్లంతైంది. ఆదివారం సాయంత్రం జములమ్మ రిజర్వాయర్ సమీపంలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. భర్త మహిబూబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

స్వచ్ఛతే లక్ష్యంగా..


అచ్చంపేట మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత యాప్‌పై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

- స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో పాల్గొంటున్న మున్సిపాలిటీలు
- మెరుగైన ర్యాంకింగ్ కోసం అడుగులు
- యాప్ ద్వారా పట్టణ ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ

అచ్చంపేట: పరిశుభ్రతకు అవార్డులు అందించే స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలోని మున్సిపాలిటీలు సిద్ధమవుతున్నాయి. దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాలకు మధ్య నిర్వహించే ఈ పోటీల్లో సత్తా చాటేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛత కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నారు.

ఉత్తమ ర్యాంక్ కోసం..

స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా నగరాలు, పట్టణాలను స్వచ్ఛమైన నివాస ప్రాంతాలుగా మార్చాలన్న లక్ష్యంతో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విధితమే. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 19 మున్సిపాలిటీలు ఉన్నాయి. 2022లో పరిశుభ్ర పట్టణాల్లో 25 నుంచి 50వేల మధ్య జనాభా కేటగిరిలో జాతీయ స్థాయిలో సౌత్ జోన్‌లో కల్వకుర్తి మున్సిపాలిటీ 18వ, నాగర్‌కర్నూల్ 27వ, అచ్చంపేట 33వ, కొల్లాపూర్ 81వ ర్యాంకులను సాధించాయి. ఇవే కాకుండా నాగర్‌కర్నూలు, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపాలిటీలు ఓడీఎఫ్-ప్లస్ సర్టిఫికెట్ అందుకున్నాయి.

విస్తృత అవగాహన

పట్టణ పరిశుభ్రత విషయంలో ఏవిధంగా ఉందో అని నేరుగా స్వచ్ఛతా యాప్ ద్వారా పట్టణ ప్రజలు అభిప్రాయాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం మున్సిపాలిటీలు పట్టణాల్లో యాప్ గురించి అవగాహన కల్పిస్తున్నారు. మున్సిపాలిటీ అందిస్తున్న సేవలు, పరిశుభ్రతపై అభిప్రాయాలను పట్టణ వాసులు పంచుకోవాల్సి ఉంటుంది. ప్రజలు 10 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఈనెల 16వ తేదీ వరకు ఇందుకు అవకాశం ఉంది.

3,500 మార్కులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొత్తం 9,500 మార్కులు కేటాయించనున్నారు. అందులో సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్‌కు 4,830, సర్టిఫికేషన్‌కు 2,500, సిటిజన్ వాయిస్‌కు 2,170 కేటాయించగా, అందులో పట్టణ ప్రజలు ఇచ్చే అభిప్రాయాలతో 600 మార్కులను కేటాయించనున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేశాయి. వాటి ప్రకారం పట్టణం ఉందా లేదా అని పరిశీలిస్తారు. అనంతరం సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్ 4,830 మార్కులకు పట్టణాన్ని బట్టి కేటాయించనున్నారు.

ఇప్పటి వరకు మున్సిపాలిటీల వారీగా అభిప్రాయాలు ఇచ్చిన వారి సంఖ్య

మున్సిపాలిటీ	అభిప్రాయాలు తెలిపిన వారు
నాగర్‌కర్నూలు	3,754
అచ్చంపేట	4,775
కొల్లాపూర్	3,212
మహబూబ్‌నగర్	62,275
వనపర్తి	2,806
గద్వాల	4,995
నారాయణపేట	5,500
పెబ్బేరు	1,793
అలంపూర్	2,229
జడ్చర్ల	32,180
భూత్పూరు	4,482
అమరచింత	1,963
కొత్తకోట	4,193
అయిజ	18,456
కోస్గి	5,309
ఆత్మకూర్	4,138
వడ్డేపల్లి	3,516
మక్తల్	5,627
కల్వకుర్తి	3,387

అభిప్రాయం తీసుకుంటున్నాం..



మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛతపై ప్రజల నుంచి అభిప్రాయం స్వీకరిస్తున్నాం. యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. 7వేల మంది నుంచి అభిప్రాయాలు తెలిపారు. వీటి ఆధారంగానే ర్యాంకులు వచ్చే అవకాశం ఉంటుంది. పట్టణాన్ని ఎప్పటిప్పుడు పరిశుభ్రంగా ఉంచుతున్నాం. ఎక్కడ చెత్తాచెదారం లేకుండా నిరంతర పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
– శ్రీహరిరాజు, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

తండాల్లో చిరుత కలకలం

- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక


ఆముదంబండతండాలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఖిల్లాఘనపురం: మండంలలోని పలు గిరిజన తండాలు, గ్రామాల్లో పులి సంచరిస్తున్నట్లు వదంతులు రావడంతో ప్రజలంతా భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం ఆముదంబండతండా సమీపంలోని గుట్టల్లో పులి గాండ్రించినట్లు శబ్దం రావడంతో మేకల కాపరులు, గిరిజనులు భయంతో తండాలకు చేరుకున్నారు. రెండు రోజుల క్రితం షాపురంలో పులి సంచరిస్తుందని పెద్ద ఎత్తున వదంతులు వచ్చాయి. పులి జాడలు చూశామని పలువురు రైతులు తెలిపారు. ఇలా రోజుకు ఓ గ్రామం, తండాలో పులి సంచరిస్తున్నట్లు వదంతులు వస్తుండటంతో ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆముదంబండతండాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ శ్రీహరి మాట్లాడుతూ.. గుట్టలకు దగ్గర్లో ఉన్న గ్రామాలు, తండాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్న పిల్లలు, మహిళలను ఒంటరిగా బయటకు పంపకూడదని సూచించారు. సాయంత్రం వరకు రైతులు ఇళ్లకు చేరుకోవడం, పశువులను గ్రామాలకు తోలుక రావడం మంచిదన్నారు. తప్పనిసరిగా గుట్టల ప్రాంతంలోని పొలాలకు వెళ్లాల్సి వస్తే ఐదారుగురు రైతులు గుంపులుగా వెళ్లాలని తెలిపారు. ఎక్కడైనా పులి ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే 100కు లేదా పోలీసులు, ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు కచ్చితంగా ఎవరూ పులిని చూడలేదన్నారు. షాపురం శివారులో సంచరించినట్లు ఫారెస్టు అధికారులు గుర్తించారని తెలిపారు.

రెండు గ్రామాల రైతులను వణికిస్తున్న చిరుత

మరికల్: మండలంలో పూసల్‌పహాడ్, రాకొండ రైతులను చిరుత కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. నెల రోజుల వ్యవధిలోనే పూసల్‌పహాడ్ పరిధిలోని సంజీవకొండ మీద లేగదూడ, గొర్రెను చంపడమే కాకుండా రాకొండ సమీపంలో ఉన్న గుట్టపై మేతకు వెళ్లిన దూడపై దాడి చేసి చంపేసింది. అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిరుత ఆచూకీ తెలుసుకుని బంధించాలని రెండు గ్రామాల రైతులు అటవీశాఖ అధికారులను కోరుతున్నారు.

హక్కుల సాధనకు పోరాడితే కేసులా?

- నిర్వాసితులపై పోలీసుల చర్యలు అమానుషం
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు


మాట్లాడుతున్న ఆంజనేయులు

గద్వాల అర్బన్: చిన్నోనిపల్లి నిర్వాసిత రైతులపై పోలీసుల చర్యలు అమానుషమని, రైతులు హక్కుల కోసం పోరాడితే కేసులు పెడతారా? అంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ప్రశ్నించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెట్టెంపాడు కింద నిర్మిస్తున్న చిన్నోనిపల్లి రిజర్వాయర్ నిర్వాసితులపై ప్రభుత్వం, పోలీసుల వైఖరి దౌర్జన్యం, కక్ష పూరితంగా ఉందన్నారు. రిజర్వాయర్‌ని అడ్డుకుంటున్నారనే నెపంతో కొందరు డ్రైవర్లతో, అధికారులతో గొడవపడినట్లు వీడియోలు తీసి, పోలీసుల ద్వారా ఒత్తిడి తీసుకొచ్చి ఎవరికీ తెలియకుండా నాన్‌బెయిలబుల్ కేసులు బనాయించారని మండిపడ్డారు. కొందరిని లక్ష్యంగా చేస్తూ వేధింపులకు గురి చేయడం మానుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు చెప్పినట్లు పోలీసులు వినడం మంచి పరిణామం కాదని, దీనిపై ఎస్పీ సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. దేశానికి వెన్నముక్కగా ఉండి అన్నం పెడుతున్న రైతులపై కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బేషరుతుగా రైతులపై నమోదు చేసిన నాన్‌బెయిలబుల్ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గోపాల్ రావు, ఆశన్న, ప్రవీణ్, రామ్ చందర్‌గౌడ్, వెంకటేష్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

తమ్ముడి మృతి తట్టుకోలేక..
రైలు కిందపడి అన్న ఆత్మహత్య

మదనాపురం: సోదరుడి మృతిని తట్టుకోలేక అన్న ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం ఆదివారం వెలుగులోకి వచ్చింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలం నాచహళ్లికి చెందిన యాదగిరి, లక్ష్మణ్, నర్సింహ ముగ్గురు అన్నదమ్ములు. కావలి యాదగిరి(32) సొంత ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గతేడాది ఆగస్టు 18న యాదగిరి తమ్ముడు లక్ష్మణ్ వనపర్తి రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి సోదరుని మరణం తటుకోలేక కలత చెంది మానసికంగా బాధపడుతుండేవాడు. కుటుంబసభ్యులతో తాను చనిపోతానని అనేవాడు. ఈనెల 18న తన సోదరుని సంవత్సరిక ఏర్పాట్లు చేస్తుండగా, మానసిక వ్యథను తట్టుకోలేక శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్తున్నానని తన భార్యతో చెప్పి బైక్ పై వనపర్తి రోడ్డు రైల్వే స్టేషన్‌కు వచ్చాడే. అక్కడే బైక్‌ను ఆపి నెల్విడి శివారులోని రైలు పట్టాలపై రాత్రి గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం ఉదయం మరో తమ్ముడు నరసింహ స్నేహితులకు తెలియడంతో కుటుంబసభ్యులకు తెలిపారు. వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శవ పరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కాల్వలో పడి జింక మృతి



మరికల్: మండలంలోని చిత్తనూర్ శివారులో ఏర్పాటు చేసిన ఇథనాల్ కంపెనీ కాల్వలో పడి జింక మృతి చెందింది. కంపెనీ పరిసరాల ప్రాంతంలో ఎక్కువ జింకలు సంచరిస్తుంటాయి. ఇక్కడ కంపెనీ ఏర్పాటు కావడం వల్ల తరచుగా జింకలు ఈ కాల్వలో పడి మృతువాత పడుతున్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. కంపెనీ నిర్వాహకులు గైని కుంట ధ్వంసం చేయడం వల్లే జింకలకు ప్రమాదం ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వన్యప్రాణులకు హాని కలిగించే కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

చిరుత దాడిలో ఆవు..

మన్ననూర్: స్థానిక వ్యవసాయ పొలాల్లో ఆవు దూడపై చిరుత పులి పిల్ల దాడి చేసి చంపిన ఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. అటవీశాఖ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. మన్ననూర్ సమీపంలోని కొత్త చెలుకలు ప్రాంతంలో పత్తి చేనులో ఆవు దూడపై చిరుతపులి దాడి చేసి చంపింది. దూడ శరీరంలోని కొంత భాగాన్ని చిరుతపులి తిన్నది. బాధితుడు రాములు ఇచ్చిన సమాచారం మేరకు మన్ననూర్ రేంజ్ బీట్ ఆఫీసర్ ఆనంద్ కుమార్ వాచర్లు నర్సింహ, మల్లయ్య సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆవును చిరుత పులి చంపినట్లు నిర్ధారించడంతో పాటు అక్కడ లభించిన అడుగు జాడలను గుర్తించారు.



పట్టుబడిన దొంగలు పరార్

- లారీ ఢీకొని ఓ దొంగ మృతి
- మరో దొంగను చితకబాది పోలీసులకు అప్పగించిన స్థానికులు
- ఆస్పత్రిలో చేర్పించగా అతను కూడా పరారీ
- బయటికి పొక్కకుండా దాచిన పోలీసులు

జడ్చర్ల: ఇద్దరు దొంగలు పట్టణంలోని ఓ కాలనీలోకి రాత్రి వేళ దొంగతనానికి వచ్చారు. కాలనీ వాసులు దొంగలను చూసి పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన దొంగలు పట్టుబడకుండా తప్పించుకునేందుకు పరుగెత్తారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న కాలనీలోకి గురువారం అర్ధరాత్రి ఏపీలోని కర్నూల్ జిల్లా కొత్తపల్లికి చెందిన సద్దాం హుస్సేన్(28), బాష దొంగతనానికి వచ్చారు. గమనించిన కాలనీ వాసులు పట్టుకునే ప్రయత్నంలో సద్దాం హుస్సేన్ తప్పించుకునే ప్రయత్నంలో జాతీయరహదారిని దాటేందుకు వేగంగా పరుగెత్తాడు. ఈ క్రమంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బాషను కాలనీ వాసులు పట్టుకుని చితకబాది పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. పోలీసులు అతన్ని స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు తెలుసుకుని చికిత్స కోసం అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆయన ఎవరికీ చెప్పకుండా పరారయ్యాడు. వీరి నుంచి దొంగతనానికి వాడే పనిముట్లుతో కూడిన బ్యాగుతో పాటు బాష మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీన పర్చుకున్నారు. పారిపోయిన వ్యక్తిని పోలీసులు లోతుగా విచారించి ఉంటే ఈ ప్రాంతంలో, ఇతర ప్రాంతాలలో చేసిన దొంగతనాలు బయటపడే అవకాశం ఉండేదని పలువురు భావిస్తున్నారు. బయటకు సమాచారం పొక్కకుండా రోడ్డు ప్రమాదంలో సద్దాం హుస్సేన్ మృతి చెందాడని మాత్రమే పోలీసులు వెల్లడించడం గమనార్హం. పారిపోయిన వ్యక్తికి చెందిన మొబైల్ తమ దగ్గరే ఉందని దీని ఆధారంగా విచారిస్తామని సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

దొరికిన చిన్నారులు అప్పగింత

అమ్రాబాద్: ఇంటి నుంచి పారిపోయిన ఇద్దరు చిన్నారులను పోలీసులు గుర్తించి బంధువులకు అప్పగించారు. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాలిలా.. సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం గుడుగుంట్లపాలెం చెందిన తులసీరామ్, మంగమ్మ దంపతులకు ఇద్దరు కవల పిల్లలు రామ్, లక్ష్మన్ ఉన్నారు. మనస్పార్థాలతో దంపతులు విడిపోయారు. పిల్లల మేనమామ రామంజనేయులు చేరదీసి పాఠశాలకు పంపతున్నాడు. ఈ క్రమంలోనే ఇద్దరు చిన్నారులు శుక్రవారం ఇంటి నుంచి పారిపోయి గ్రామంలోనే కొంతమంది వద్ద డబ్బులు అడిగి శనివారం సాయంత్రం అచ్చంపేటకు వచ్చారు. అక్కడనే బస్టాండ్‌లో ఉండి ఆదివారం ఉదయం మద్దిమడుగు బస్సు ఎక్కారు. వారు చెబుతున్న సమాధానానికి పొంతన లేకపోవడంతో ఆర్టీసీ కండక్టర్ అమ్రాబాద్ పోలీసుస్టేషన్ వద్ద బస్సు ఆపి చిన్నారులను వారికి అప్పగించారు. వారితో మాట్లాడిన ఎస్‌ఐ పూర్తి వివరాలు తెలుసుకుని వారి మేనమామను పిలిపించి అప్పగించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు


జిల్లా కేంద్రంలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న బీజేపీ నేత డీకే అరుణ

గద్వాల/మల్దకల్: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హెచ్చరించారు. గద్వాల మున్సిపల్ పరిధిలో, మల్దకల్‌లో బీజేపీ చేపట్టిన జెండా పండుగలో ఆమె పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రజ సమస్యలను తెలుసుకున్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి, ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని, బీసీ రుణాలు కొందరికే ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మా కాలనీలో ఉన్న దొడ్ల స్థలాలను బీఆర్‌ఎస్ నాయకులు దౌర్జన్యంగా కబ్జా చేశారని వాపోయారు. అనంతరం డీకే అరుణ మాట్లాడుతూ.. ప్రజలను మభ్యపెట్టి మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. బీసీ కాలనీలో పేదలు వేసుకున్న గుడిసెలను బీఆర్‌ఎస్ నాయకులు తొలగించి కబ్జా చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులు భూమాఫియా అవతారం ఎత్తేరని, వారి వైఫల్యాలను, అక్రమాలను ప్రజల ముందుంచితే జీర్ణించుకోలేక పోతున్నారని చెప్పారు.

పేదల సంక్షేమానికి బీజేపీ కృషి

బీజేపీ ప్రభుత్వం పేదల కోసం రూ.కిలో బియ్యం, సుకన్య సమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్ పథకం, బీమాయోజన కిసాన్ క్రెడిట్ కార్డులు వంటి వాటిని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, యల్లప్ప, శంకర్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా, ధరూర్ మండలం కొత్తపాలెం మాజీ సర్పంచు ధర్మరావు బీఆర్‌ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆదివారం బీజేపీ నేత డీకే అరుణ పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అలాగే, ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, అర్చకులు, నాయకులు వారికి స్వాగతం పలికారు.

భాస్వరం...పొటాషియం కీలకం

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: మొక్క పెరుగుదలలో నత్రజని, భాస్వరం, పొటాషియంల పాత్ర కీలకమని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియా నాయక్ రైతులకు విధంగా వివరించారు.

భాస్వరం: ఈ పోషకాన్ని మొక్కలు భాస్వరికామ్ల లవణాల రూపంలో తీసుకుంటాయి. భాస్వరం నేలలో కొట్టుకు పోదు. కానీ కొంతభాగం నేలలో బిగుసుకుపోతుంది. మట్టి రేణువును అంటిపెట్టుకుని తర్వాత పైరుకు కూడా ఉపయోగపడుతుంది. పైరుకు ప్రథమదశలో ఇది ఎంతో అవసరం. కావున పూర్తి మోతాదు మొదటనే పైరు అడుగులో ఒకేసారి వేసి నేలలో కలిసేటట్లు చేయాలి.

పంటల పెరుగుదలలో భాస్వరం పాత్ర

- పూత, కాత, గింజ పట్టడానికి
- పైరు దుబ్బు చేయడానికి, మొక్కలో శాఖలు విస్తరించడానికి
- మొక్కలలో మాంసకృత్తులు, ఎంజైముల తయారీకి ఉపయోగపడుతుంది.

భాస్వరం లోపిస్తే

- మొక్క పెరుగుదల, పిలకలు పెట్టె శక్తి తగ్గుతుంది.
- వేళ్లు బలహీనంగా మారతాయి.
- ఆకులు ముదురు ఆకు పచ్చ నీటి రంగు కలిసినట్లుగా ఉంటాయి.
- పూత రావడం, పైరు పక్వానికి రావడం అలస్యం అవుతుంది.
- పండ్లు, గింజలు, విత్తనాల అభివృద్ధి కావడం తక్కువగా ఉంటుంది.


పోటాష్ లోపించిన మొక్క

భాస్వరం, నత్రజని తగినంత మోతాదులో ఉన్నప్పుడు రెండింటిని మొక్క అత్యంత సమర్థవంతంగా ఉపయోగించుకోవడంలో ఒకదానికి ఒకటి తోడ్పడతాయి.

పొటాషియం : ఈ పోషకాన్ని మొక్క పోటాషియం రూపంలో తీసుకుంటుంది.

పొటాషియం లోపిస్తే :

- ముదురు ఆకుల అంచులు ఆకు పచ్చని రంగు నుంచి పసుపు రంగులోకి మారిపోవడం ఆకు కొనలు గోధుమ రంగులోకి మారి దిగువ భాగానికి విస్తరించడం జరుగుతుంది.
- పెరుగుదల నెమ్మదిగా ఉండి మొక్క గిడసబారుతుంది.
- కాండం బలంగా లేక సులభంగా వాలిపోతుంది.
- పండ్లు కూరగాయాల్లో రంగు, రుచి, వాసన, రవాణాలో నిల్వ ఉండే గుణం తగ్గుతుంది.

పొటాషియం ప్రాధాన్యత :

- పైరుకు ఆరోగ్యం, ధృడత్వం చేకూరుతుంది.
- మొక్కల్లో జరిగే జీవ రసాయన క్రియలకు ఆకుల్లో తయారైన పిండి పదార్థం ఇతర భాగాలకు చేరేందుకు సహకరిస్తుంది.
- పైరుకు రోగ నిరోధక శక్తిని కలిగించి పురుగులకు, తెగుళ్లకు లొంగనీయదు.
- శాఖీయ భాగాలను కాండాన్ని బలపరిచి నేలపై వాలనీయదు.
- గింజ కట్టు పూర్తిగా ఉండి నాణ్యత పెరుగుతుంది.
- ప్రత్యేకించి పండ్లు కూరగాయాలు వంటి పంటల్లో నాణ్యత పెరగడానికి దోహదపడుతుంది.
- చలి వాతవరణం లాంటి ప్రతి కూల పరిస్థితులను తట్టుకోవడానికి ఉపయోగపడుతుంది.



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు.

ఫీజు విషయంలో గొడవ

లాయర్ దాడిలో క్లయింట్ మృతి

బాన్సువాడ రూరల్ : న్యాయసలహా కోసం వెళ్లిన క్లయింట్‌తో కలిసి మద్యం తాగిన ఓ లాయర్ ఫీజు విషయంలో ఘర్షణపడి దాడిచేయడంతో క్లయింట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడకు చెందిన షేక్ అహ్మద్ (45) ఆర్బాత్ కాలనీలో తన ఇంటిపై పై అంతస్తు నిర్మించేందుకు సాజిల్ అనే వ్యక్తికి రూ.18 లక్షలకు కాంట్రాక్టుకు ఇచ్చాడు. ఇందులో రూ.17 లక్షలు చెల్లించినా పనిమాత్రం ఇంకా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ తప్పించుకు తిరుగుతుండటంతో అతనిపై చట్టరీత్యా చర్యల కోసం షేక్ అహ్మద్ శనివారం సాయంత్రం పట్టణానికి చెందిన ఉబేద్ అనే లాయర్ వద్దకు న్యాయసలహా కోసం వెళ్లాడు.

వాటర్ ప్లాంట్‌లో మద్యం తాగుతూ...

లాయర్‌కు చెందిన వాటర్ ప్లాంట్‌లోనే ఉబేద్, క్లయింట్ షేక్ అహ్మద్, ఆ ప్లాంట్‌లో పనిచేసే మహమూద్, మరోవ్యక్తి అలీం కలిసి మద్యం తాగుతూ కేసు విషయమై చర్చిస్తుండగా లాయర్ ఫీజు విషయంలో గొడవ ప్రారంభమైంది. గొడవలో ఉబేద్, షేక్ అహ్మద్‌ను కిందికి తోసి తలపై కర్ర విసిరి, బండరాయితో తలపై కొట్టడంతో రక్తపుమడుగులో పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు షేక్ అహ్మద్‌ను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ షేక్ అహ్మద్ ఆదివారం ప్రైవేటు న్యూరో ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతుడి తమ్ముడు షేక్ మహమూద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

భారీగా విద్యుత్ డిమాండ్

వర్షాభావంతో పెరిగిన ఉచిత విద్యుత్ వినియోగం • వేసవిని తలపిస్తున్న కరెంట్ వాడకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అనూహ్యంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. ఆగస్టు మొదటివారం నుంచి మళ్లీ వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండడమే ఇందుకు కారణం. రాష్ట్రంలోని 31లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వర్షాలు లేక బోరుబావుల కింద ఉచిత విద్యుత్ బాగా వాడేస్తున్నారు. పంటలను రక్షించుకోవడానికి రైతులు పెద్దఎత్తున విద్యుత్ వినియోగిస్తున్నారు. దీంతో గతవారం రోజులుగా రాష్ట్రంలో రోజువారీ గరిష్ట విద్యుత్ డిమాండ్ 13వేల మెగావాట్లకు మించిపోయింది. ఈ నెల 11న అత్యధికంగా 13,829 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. అదేరోజు జాతీయస్థాయిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 2,28,963 మెగావాట్లకు చేరి కొత్త రికార్డు నెలకొల్పింది. సాధారణంగా వేసవిలో డిమాండ్ ఈ స్థాయిలో పెరుగుతూ ఉంటుంది. గత నెలాఖరులో ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురవడంతో అప్పట్లో రోజువారీగా రాష్ట్రస్థాయిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 8వేల మెగావాట్లలోపు మాత్రమే నమోదైంది. గత నెల 27న అయితే గరిష్ట డిమాండ్ ఏకంగా 6904 మెగావాట్లకు పడిపోయింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ త్వరలో 14వేల మెగావాట్లకు చేరే అవకాశాలున్నాయని



విద్యుత్ వినియోగం ఇలా (మెగావాట్లలో)

జూలై 27న	6904
ఆగస్టు 11న	13,829

ట్రాన్స్‌కో యాజమాన్యం అంచనా వేస్తోంది.

జల విద్యుదుత్పత్తిపై కరువు నీడలు

కృష్ణా బేసిన్‌లో తీవ్ర వర్షాభావం కారణంగా ఈ ఏడాది శ్రీశైలం, నాగార్జునసాగర్ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ప్రశ్నార్థకంగా మారింది. కనీసం 3000 మిలియన్ యూనిట్ల(ఎంయూ) జల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రతి ఏటా తెలంగాణ జెన్‌కో లక్ష్యంగా పెట్టుకుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 1000 ఎంయూలు కూడా ఉత్పత్తి చేసే పరిస్థితి కనిపించడం లేదు. శ్రీశైలం, సాగర్ జలాశయాలు ఈ ఏడాది పూర్తిస్థాయిలో నిండే పరిస్థితి లేదు. ఇంకా శ్రీశైలం ప్రాజెక్టు నిండాలంటే 97 టీఎంసీలు, నాగార్జునసాగర్ నిండాలంటే 166 టీఎంసీల వరద ఎగువ నుంచి రావాలి. ఆదివారం నాటికి శ్రీశైలం జలాశయానికి కృష్ణానది ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది.

రోజూ రూ.30 కోట్ల విద్యుత్ కొనుగోళ్లు

ప్రస్తుతం జలవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం లేకపోవడంతో గరిష్ట డిమాండ్ నెలకొని ఉండే వేళల్లో నిరంతర విద్యుత్ కొనసాగించడానికి పవర్ ఎక్స్ఛేంజీల నుంచి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు పెద్దఎత్తున విద్యుత్ కొనుగోళ్లు చేస్తున్నాయి. రోజూ రూ.30 కోట్ల వ్యయంతో 60 ఎంయూల విద్యుత్‌ను ఎక్స్ఛేంజీల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న డిస్కంలకు రోజువారీ విద్యుత్ కొనుగోళ్లు తీవ్ర భారంగా మారాయి.

తిరుమల కాలినడక..ఘాట్ మార్గాల్లో ఆంక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

కాలినడక మార్గంలో అనుమతిస్తారు. శ్రీవారి మెట్టు వైపు కాలినడక మార్గంలో మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే 15 సంవత్సరాలలోపు చిన్నారులను తల్లిదండ్రులు, బంధువులతో అనుమతిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెద్దలను మాత్రమే ఈ మార్గంలో అనుమతిస్తారు. శనివారం నుంచి రెండు ఘాట్ రోడ్లలో సాయంత్రం 6 గంటల తరువాత ద్విచక్ర వాహనాల రాకపోకలను నిలిపివేసిన విషయం తెలిసిందే.

చిన్నారుల రక్షణకు ట్యాగ్‌లు

అలిపిరి నుంచి తిరుమల నడకదారిలోని అటవీ ప్రాంతంలో చిరుతల సంచారం పెరగడం, దాడుల నేపథ్యంలో పోలీసులు రక్షణ చర్యలను చేపట్టారు. ఆదివారం నుంచి అలిపిరి నడక మార్గంలోని ఏడో మైలు వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు ట్యాగ్‌లు వేస్తున్నారు. ట్యాగ్‌లు వేయడం వల్ల తల్లిదండ్రుల నుంచి పిల్లలు తప్పిపోయి నా సులభంగా కనిపెట్టేందుకు వీలవుతుంది. ట్యాగ్ పై చిన్నారి పేరు, తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నంబర్, పోలీస్ టోల్‌ఫ్రీ నంబర్ నమోదు చేసి ఉంటాయి.

ఐదు ప్రాంతాల్లో చిరుత సంచారం

నడక మార్గం, ఘాట్ రోడ్లలో ఐదు ప్రాంతాల్లో చిరుత సంచారం జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడ చిరుతలు పెరిగినట్టు అటవీ అధికారులకు సమాచారం అందుతోంది. శనివారం కూడా నడక మార్గం, ఘాట్ రోడ్లలోని చిరుతల సంచారం గుర్తించారు. అలిపిరి నుంచి గాలిగోపురం వరకు మూడు ప్రాంతాలు, గాలి గోపురం నుంచి ఏడో మైలు వద్ద చిరుత సంచారాన్ని గుర్తించారు. రెండో ఘాట్ రోడ్డులోని 38 మలుపు చిరుత తిరుగుతున్నట్టు గుర్తించారు. దీంతో భక్తులను అప్రమత్తం చేశారు.

ఆపదను తప్పించే 'ఆలోచన'




తిరుమల అలిపిరి నడక మార్గంలో ఓ భక్తుడు ఆదివారం అందరినీ ఆకట్టుకున్నాడు. నడక మార్గంలో వన్య ప్రాణులు సంచరిస్తోన్న నేపథ్యంలో విజయవాడకు చెందిన ఓ భక్తుడు తన కుమారుడి చేతికి రబ్బర్ ఎలాస్టిక్ తాడు తగిలించి..ఆ తాడును ఆయన చేతికి ఇలా కట్టుకున్నాడు. దీనిపై ఆ భక్తుడిని ప్రశ్నించగా తమ జాగ్రత్త కోసమే తాడు కట్టినట్లు చెప్పాడు.

– తిరుమల

'వైద్యం'లో తెలంగాణ నంబర్ వన్

- కేసీఆర్ హయాంలో ఎంతో ప్రగతి
- ప్రభుత్వ వైద్యులకు పీజీలో రిజర్వేషన్లు కల్పిస్తాం
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): వైద్యం, వైద్య విద్యలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైద్యవిద్యలో రాష్ట్రం ఎంతో వెనుకబడి ఉండేదని, నిజామ్, బ్రిటిషర్లు ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులే ఉండేవని గుర్తుచేశారు. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో వైద్యరంగంలో ఎంతో ప్రగతి సాధించామని చెప్పారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ఆదివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి జిల్లాకు ఓ వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని హరీశ్ అన్నారు. లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లతో దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్నామని, అలాగే పీజీలో 8 సీట్లతో రెండవ స్థానంలో ఉన్నామని తెలిపారు. ధాన్యం ఉత్పత్తితో పాటు వైద్యులను తయారు చేయడంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందన్నారు. ఎంబీబీఎస్ ఫీజులు రాష్ట్రంలోనే తక్కువని, వైద్య విద్యార్థులకు అందించే స్టైఫండ్ అన్ని రాష్ట్రాలకంటే ఇక్కడే



మాట్లాడుతున్న హరీశ్

ఎక్కువ అని చెప్పారు. ప్రభుత్వ వైద్యులకు పీజీలో రిజర్వేషన్ సదుపాయం కల్పిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. నగరం నలుదిక్కుల నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్ గ్లోబల్ హెల్త్ హబ్‌గా మారిందని, ఇతర దేశాలకు చెందినవారంతా వైద్యసేవలు, చికిత్సల కోసం హైదరాబాద్‌కు క్యూ కడుతున్నారని తెలిపారు. త్వరలోనే గాంధీ ఆస్పత్రిలో అవయవ మార్పిడి, ఫెర్టిలిటీ, ఎంసీహెచ్ భవనాలు, అధునాతన అపరేషన్ థియేటర్లు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు, సదుపాయాలు కల్పించామని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ అందజేశారు. డీఎంఈ రమేష్ రెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, పలువురు హెచ్‌ఓడీలు, ఆర్‌ఎంఓలు, వైద్యులు, వైద్యవిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పర్యావరణ విధ్వంసంతోనే వాతావరణ మార్పులు

ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పర్యావరణ విధ్వంసం కారణంగానే వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి తెలిపారు. వాతావరణ మార్పుల కారణంగా అతి తక్కువ సమయంలో భారీ వర్షాలు, తీవ్రమైన తుపానులు వంటి వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటి నుంచి రేయింబవళ్లు యుద్ధప్రాతిపదికన శ్రమిస్తే తప్ప పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చలేని పరిస్థితి ఉందని... తక్షణమే శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం పెరగాలని పురుషోత్తమ్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఢిల్లీలోని ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేపిటల్ ఫౌండేషన్ సంస్థ ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్‌ను అందించింది. పశ్చిమ బెంగాల్ గవర్నర్ డా. సీవీ ఆనందబోస్ చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, జస్టిస్ ఏకే పట్నాయక్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో



అవార్డు అందుకుంటున్న పురుషోత్తంరెడ్డి


పురుషోత్తంరెడ్డితో పాటు సామాజికంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన పలువురికి అవార్డులు అందించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణం, సుస్థిరాభివృద్ధి రంగంలో గత 50 ఏళ్లుగా తాను చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. మన దేశంలో పర్యావరణ చట్టాలు బాగున్నప్పటికీ... వాటి అమలు మాత్రం సరిగా జరగడం లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక యంత్రాంగాలను నిర్వీర్యం చేస్తున్నాయని.. ఇసుక వంటి ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టాల్సింది స్థానిక యంత్రాంగాలేనని తెలిపారు. భారత్‌లో అంతులేని సౌరశక్తి ఉందని, దానిని ఉపయోగించుకోవడం ద్వారా సంప్రదాయ ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవాలని ఆయన సూచించారు.

ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని వినతి




జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయంలో బాధ్యతగా పని చేయాల్సిన సీనియర్ అసిస్టెంట్ హైందవ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. అనంతరం ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్యకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కార్యదర్శి అశోక్, రాజగోపాల, మధుసూదన్‌గౌడు చైర్మన్‌తో మాట్లాడి ఆలయ పవిత్రతను కాపాడాలని కోరారు. ఇలాంటి ఉద్యోగులు చేసే పనులతో ఆలయాలు అబాసుపాలు అవుతాయన్నారు.

కృష్ణానదిలో.. పెరుగుతున్న నీటిమట్టం



కొల్లాపూర్ రూరల్: ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో కృష్ణానదిలో బ్యాక్‌వాటర్ పెరుగుతోంది. ఈ క్రమంలో ఆదివారం మండలంలోని సోమశిల వద్ద పుష్కర ఘాట్ల వరకు వరద వచ్చింది. రోజురోజుకూ బ్యాక్‌వాటర్ పెరుగుతుండటంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు.

జూరాలకు 13 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో నిలకడగా ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రానికి 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆదివారం రాత్రి 8 గంటల వరకు 13వేల క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో మొత్తం రెండు పంపుల ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. 113 క్యూసెక్కుల నీరు ఆవిరి కాగా, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 870, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.493 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు స్వల్పంగా వరద కొనసాగుతుంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 7,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 5వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా, 122.483 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 32.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు కేవలం 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో లేదని అధికారులు చెప్పారు.

శ్రీశైలంలో 863.8 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 863.8 అడుగుల నీటిమట్టం, 118.3 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400, పోతిరెడ్డిపాడు ద్వారా 12వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 6.552 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 10,757 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. శ్రీశైలం జలాశయంలో 317 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో ఆదివారం పూర్తి స్థాయి నీటి మట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 870, సమాంతర కాల్వ ద్వారా 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 950 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కులు, భీమా ఫేజ్–2 ద్వారా 851 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

జూరాలకు సందర్శకుల తాకిడి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి తగ్గడం లేదు. ప్రాజెక్టుకు పెద్దగా వరద లేకపోయినప్పటికీ ఆయా ప్రాంతాల నుంచి సందర్శకులు సందర్శనకు వస్తున్నారు. ఆదివారం కావడంతో ప్రాజెక్టు వద్ద సందర్శకులు కనిపించారు. పిల్లలతో కుటుంబ సమేతంగా ప్రాజెక్టు వద్దకు చేరుకుని పరిసర ప్రాంతాలతో పాటు రిజర్వాయర్ భాగంలో నీటి అలలను తిలకించారు. ముఖ్యంగా చేప వంటకాల వద్ద పెద్ద ఎత్తున రద్దీ కనిపించింది.



జూరాల ప్రాజెక్టుపై సందర్శకులు

వైభవంగా ఆరుద్రోత్సవం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం ఆరుద్రోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ధ్వజ స్తంభం వద్ద గోమాతకు పూజలు చేసి ఆలయం చుట్టూ ప్రదిక్షణ చేశారు. రససిద్ధ గణపతికి అభిషేకాలు, మహన్యాస పారాయణాలు నిర్వహించారు. గర్భాలయంలో బాలబ్రహ్మేశ్వరుడుకి భక్తులు అభిషేకాలు చేస్తుండగా నమక చమకాలను 11 సార్లు పఠిస్తూ ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. 25 కేజీల అన్నంతో మల మూర్తికి అన్నసూక్తం పఠిస్తూ అన్నాభిషేకం చేశారు. అదే విధంగా అన్నంతో స్వామి వారికి లింగాకృతిలో అలంకరించి బిల్వాష్టోత్తరం, మహానివేదనలు, దశ విదహారతులు అర్పించారు.దాలయానికి వచ్చిన భక్తులకు ఆరోద్రత్సవం యొక్క విశిష్టతను తెలియజేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భోజనాలు కల్పించారు.



బాల బ్రహ్మేశ్వరుడికి అన్నాభిషేకం



హారతి తీసుకుంటున్న భక్తులు

బీఆర్ఎస్ పతనం ప్రారంభమైంది..

ఊర్కొండ: అవినీతి, భూ కబ్జాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ప్రజాహిత పాదయాత్రలో భాగంగా మండలంలోని జకినాలపల్లి నుంచి ఊర్కొండపేట, ఊర్కొండలో పాదయాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇప్పటివరకు ప్రభుత్వ కార్యాలయాలు లేవన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ కనీసం హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నాడు డబుల్ బెడ్రూం ఇళ్లకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి, ఎన్నికలు దగ్గర పడుతుండడంతో రూ.3లక్షలుగా మార్చారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు అభివృద్ధి కార్యక్రమాల పేరుతో టెంకాయలు కొట్టి ప్రారంభోత్సవాలు చేయడం తప్పా, రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏమాత్రం లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయని ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వృద్ధులకు రూ.4వేల పింఛన్, రూ.2లక్షల రైతుల రుణమాఫీ, రైతుబంధు ఎకరానికి రూ.15వేలు, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. పాదయాత్ర 250 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, కేక్ చేశారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, రబ్బాని, గోపి నాయక్, వెంకటయ్యగౌడ్, రమేష్నాయక్, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్రెడ్డి, అయ్యుబ్బాషా, విజయ్, సమి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఊర్కొండ గ్రామస్తులతో కలిసి పాదయాత్ర నిర్వహిస్తున్న అనిరుధ్‌రెడ్డి



యాగశాల వద్ద ఆకట్టుకుంటున్న శ్రీరామ చిత్రం

మహాయాగానికి ఏర్పాట్లు పూర్తి



సిద్ధమైన యాగశాల

జడ్చర్ల టౌన్: శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సమీపంలో 80వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. 14రోజుల పాటు నిర్వహించే మహోత్సవంలో ఆయుత చండి అతిరుద్రం, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండోసారి నిర్వహిస్తున్నారు. తొలిసారిగా 2014లో మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించారు. యాగ మహోత్సవంలో 600మంది వేద పండితులు హాజరుకానున్నారు. 300మంది హోమాలు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. తొలిరోజు ఉదయం 7గంటలకు గోపూజతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

అనేక సత్ఫలితాలు..

విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న ఆయుత చండీ మహాయాగం వల్ల 10వేల చండీ పారాయణాలు, వెయ్యి హోమాలు చేసిన ఫలితం దక్కుతుందని కృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానందస్వామి స్పష్టం చేశారు. యాగం చేసిన ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని, వచ్చే ఐదేళ్లలో నాలుగైదురెట్ల అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని, రోగాలు దరిచేరకుండా ఉంటాయన్నారు. అతిరుద్ర మహాయాగం వల్ల రోగభయాలు పోయి కార్యసిద్ధి కలుగుతుందన్నారు. ఒక్కోరోజు నిర్వహించే హోమం వల్ల ఒక్కో ఫలితం ఉంటుందని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.